

పాతబస్తీలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఓటర్లతో మాట్లాడి ఓటును అభ్యర్థించారు.

ఓటింగ్ శాతం పెంచడంపై ప్రత్యేక దృష్టి

బీఎల్‌ఓలతో ఇంటింటికి అవగాహన • తాజాగా పెరిగిన 18,359 ఓటర్లు

చాంద్రాయణగుట్ట: హోరా హోరీగా సాగే ఎన్నికల పోరులో అభ్యర్థుల గెలుపోటములు నిర్ధారించేది పోలింగ్ శాతమే. దీనిని దృష్టిలో ఉంచుకుని తమకు పట్టున్న పోలింగ్‌బూత్ (స్టేషన్)లలో అధిక శాతం పోలింగ్ జరిగేలా ఆయా రాజకీయ పార్టీలు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరరూ వినియోగించుకోవాలని అధికార యంత్రాంగం ఎంత ప్రచారం చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో ఓటింగ్ మాత్రం కావడం లేదు.

- తాజాగా ఎన్నికలు సమీపిస్తుండటంతో అభ్యర్థులు బూత్‌ల వారీగా ఉన్న ఓట్లను బేరీజు వేసే పనిలో పడ్డారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో గత ఎన్నికల్లో జరిగిన పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే అంతంత మాత్రంగానే ఉంది.



పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు (ఫైల్)

చాంద్రాయణగుట్టలో 3,28,293 ఓటర్లు

చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్ బూత్‌ల పరిధిలో 3,28,293 ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,64,437 మంది పురుషులు, 1,63,825 మంది స్త్రీలు ఉన్నారు. 31 మంది ట్రాన్స్‌జెండర్లుగా ఉన్నారు. సగటున ఒక్కో బూత్‌లో 1100ల వరకు ఓట్లు ఉన్నాయి. ముస్లిం ఓటర్లు అధికంగా ఉండే ఈ నియోజవర్గంలో సాధారణంగానే ఓటింగ్ శాతం తక్కువగా నమోదౌతుంది. వారి ఓట్ల పైనే ఆధారపడిన పార్టీలు ఈసారి ఓటింగ్ శాతం పెంచడంపైనే ప్రత్యేక దృష్టి సారించాయి. తాజాగా పెరిగిన ఓట్లతో 3,46,359కు చేరింది.

తాజాగా పెరిగిన 18,359 ఓటర్లు..

నియోజకవర్గంలో గత నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో 25,977 ఓటర్లు నమోదు చేసుకోగా...అందులో అధికారులు 18,359 ఓట్లకు ఆమోదం లభించింది. 3,826 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి.

గతంలో నమోదైన పోలింగ్ శాతం ఇలా..

2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 2,91,022 ఓట్లకు గాను 46.11 శాతంతో మొత్తం 1,40,291 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 2014లో 2,63,246 మంది ఓటర్లుండగా.. 52 శాతం పోలింగ్‌తో 1,36,888 ఓట్లు పోలయ్యాయి. 2009 ఎన్నికల్లో 55.44 శాతం కాగా, 2004లో 44.11 శాతం, 1999లో 71.90 శాతం, 1994లో 56.20 శాతం, 1989లో 74.25 శాతం, 1985లో 74.79 శాతం, 1983లో 8 1.37 శాతం, 1978లో 58.78 శాతం నమోదైంది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో 1981లోనే అత్యధికంగా నమోదు కావడం విశేషం.

పోలింగ్ శాతం పెంచే ప్రయత్నం చేస్తున్నాం..



నియోజకవర్గంలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. బీఎల్‌ఓలు ఇంటింటికి తిరుగుతూ ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ.. ఓటర్ల ఫోన్ నంబర్లు కూడా తీసుకుంటూ... ఇళ్లకు స్టిక్కరింగ్ చేస్తున్నారు. ఓటర్ స్లిప్‌లు కూడా ముందస్తుగానే పంపిణీ చేస్తాం. ముఖ్యంగా 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఎఫ్–12డి ఫారమ్ దరఖాస్తు చేసుకుంటే వారి ఇంటికెళ్లి ఓటును తీసుకునే అవకాశం కూడా కల్పించడం జరుగుతుంది. పోలింగ్‌బూత్‌లలో విద్యుత్, ఫ్యాన్లు, మూత్రశాలలు, దివ్యాంగుల వీల్‌చైర్ల కోసం ర్యాంప్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఓటర్లు నిర్భయంగా బూత్‌లకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– రిటర్నింగ్ అధికారి సూర్యప్రకాష్

జంగ్ తెలంగాణ 2023

అండర్ -19 ఫుట్‌బాల్ కెప్టెన్ నియామకం



అనస్‌మోహియుద్దీన్

గోల్కొండ: 74వ స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్‌గా గోల్కొండకు చెందిన అనస్‌మోహియుద్దీన్ ఎంపికయ్యారు. గోల్కొండ రిసాలబజార్‌లోని గోల్కొండ క్లబ్‌లో సఫ్దర్‌పాషా శిక్షణలో రాటుతేలిన అనస్ గోల్కొండ ఫుట్‌బాల్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పటి వరకు నగరంతో పాటు తెలంగాణలో జరిగిన వివిధ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ఆయన అనేక సార్లు విశిష్ట యువ క్రీడాకారుడిగా అవార్డులు పొందారు. శ్రీనగర్‌లో జరుగనున్న 74వ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడానికి అనస్‌మోహియుద్దీన్ ఎంపికయ్యాడు. శనివారం జట్టు సభ్యులు, కోచ్‌లతో అనస్ శ్రీనగర్‌కు బయలుదేరి వెళ్లారు.

గోల్కొండలో మజ్లిస్ పాదయాత్ర



గోల్కొండలో ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఈసారి కూడా తాను భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ, గోల్కొండ, తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేసి ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మరోసారి తనకు ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్వాన్ నియోజకవర్గాన్ని గత పదేళ్లల్లో తాను వేలకోట్లతో అభివృద్ధి పనులు చేసి కార్వాన్‌ను నెంబర్‌వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దానన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ రిసాలబజార్‌లో ఆయనకు ఘనంగా స్వాగతం పలికి పూలమాలతో సన్మానించారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు బదరుద్దీన్, హారూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పఠాన్ తదితరులున్నారు.

నాంపల్లిలో ఒకటే నామినేషన్

నాంపల్లి: నియోజకవర్గంలో శనివారం ఒకటే నామినేషన్ దాఖలైంది. బీఆర్ఎస్ నేత, గుడిమల్కాపూర్ నివాసి ఇంగోల్కర్ సంతోష్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీ తరఫున నామినేషన్ వేశారు. అభ్యర్థి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఏ, బీ ఫారాలను అందజేయలేదు. గతంలో మెహిదీపట్నం డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్‌గా పనిచేసి ఓటమి పాలయ్యారు.

పాతబస్తీలో రెండే నామినేషన్లు దాఖలు

చార్మినార్: పాతబస్తీలోని చార్మినార్, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర మూడు నియోజకవర్గాలలో శనివారం ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. ఇక యాకుత్‌పురా నియోజక వర్గం నుంచి మహ్మద్ అక్రం అలీఖాన్, సరిత అనే ఇద్దరు స్వతంత్ర్య అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారి వెంకటాచారికి అందజేశారు. దీంతో పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాలలో కేవలం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా సంబంధిత పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. ఆర్వో కార్యాలయాలకు 100 మీటర్ల వద్ద బారికేడ్లు వేసి బందోబస్తును కొనసాగిస్తున్నారు.

గెలిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా !



లలితాబాగ్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బోయ నరేష్

చాంద్రాయణగుట్ట: నియోజకవర్గ అభివృద్ధి కోసం చాంద్రాయణగుట్టలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి బోయ నరేష్ కోరారు. లలితాబాగ్ డివిజన్‌లోని తానాజీనగర్, భయ్యాలాల్‌నగర్, సరస్వతీ శిశు మందిర్ తదితర బస్తీలలో శనివారం ఇంటింటికి తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందన్నారు. బీజేపీ సైతం కార్పొరేట్ శక్తులకే దేశ సంపదను దారాదత్తం చేస్తుందని విమర్శించారు. స్థానికంగా నివాసం ఉండే తనను గెలిపించాలని కోరారు.

బీజేపీతోనే స్వచ్ఛమైన పాలన



ఎన్నికల ప్రచారంలో బీజేపీ కార్వాన్ అభ్యర్థి టి.అమర్‌సింగ్

గోల్కొండ: స్వచ్ఛమైన పాలన అందించే సత్తా కేవలం బీజేపీకే ఉందని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని ఫోటో ఉన్న బీజేపీ హామీల కరపత్రాన్ని స్థానికులకు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కార్వాన్‌లో అభివృద్ధి పనులు జరగలేదని ఆరోపించారు. చిన్న చినుకుపడితే ఎన్నో బస్తీలు ముంపునకు గురై ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. నేడు కార్వాన్‌లో ఎక్కడ చూసిన మురుగు ప్రవహిస్తుందన్నారు. ప్రజలకు కనీస అవసరాలు కల్పించడంలో మజ్లిస్‌కు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. మజ్లిస్ పార్టీ కేసీఆర్‌కు సేవ చేయడంలోనే ఉందని ఆరోపించారు. నాయకులు డిజ్వర్‌సింగ్, జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు.

యజ్ఞ యాగాలతో దేశం సుభిక్షం

సుల్తాన్‌బజార్: యజ్ఞ యాగాలతో దేశం సుభిక్షంగా ఉంటుందని భజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. విద్య శక్తిపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజశ్యామల యజ్ఞం కార్యక్రమానికి భజరంగ్‌సేన ప్రముఖులు హాజరై యజ్ఞ యాగాదుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శృంగేరి పీఠాధిపతి శ్రీ భారతీతీర్థమహాస్వామి, విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామి ఆశీర్వచనాలను పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యజ్ఞ యాగాల వల్ల దేశం సుభిక్షంతో పాటు అభివృద్ధి చెందుతుందన్నారు. నిత్యం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతూ.. సనాతన ధర్మం గురించి పౌరులకు తెలియజేస్తామని పేర్కొన్నారు. హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ధ్యేయంగా భజరంగ్ సేనా పనిచేస్తుందని వివరించారు. సంస్థ ప్రతినిధులు నందుకిశోర్ అగర్వాల్, సూర్యశుక్లా, అభినయ్ తివారి, వీరేందర్, రామేశ్వర్ మిశ్ర తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కేంద్రమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్

అట్టహాసంగా రాజాసింగ్ నామినేషన్



బుల్లెట్‌పై రిటర్నింగ్ కార్యాలయానికి.

అబిడ్స్: గోషామహాల్ బీజేపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే రాజాసింగ్ బుల్లెట్‌పై వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అట్టహాసంగా భారీ ర్యాలీ నిర్వహించగా.. దూల్‌పేట్‌లోని ఆకాష్‌పురి హనుమాన్ ఆలయం నుంచి బీజేపీ కార్యకర్తలు, నాయకులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఓపెన్‌టాప్ జీపులో ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీని కొనసాగించారు. దూల్‌పేట్ నుంచి పురానాపూల్, బేగంబజార్, సిద్దిఅంబర్‌బజార్ మీదుగా అబిడ్స్ నుంచి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అంతకు ముందు బుల్లెట్‌పై వెళ్లి నామినేషన్ దాఖలు చేసిన రాజాసింగ్ పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు.

ముంతాజ్‌తో చార్మినార్ మజ్లిస్ అభ్యర్థి భేటీ



ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో ఎమ్మెల్యే అభ్యర్థి మీర్ జుల్ఫికర్ అలీ

చార్మినార్: చార్మినార్ మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫికర్ అలీ మాజీ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటికే చార్మినార్ నుంచి ఈసారి కూడా తనకే టికెట్ కేటాయించాలని పార్టీ అధిష్టానాన్ని కోరిన ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌కు ఈసారి టికెట్ దక్కలేదు. దీంతో ఆయన కొంత నిరాశకు గురైనట్లు గ్రహించిన పార్టీ అధిష్టానం పార్టీ ప్రముఖులతో బుజ్జగించింది. ఆయనను శనివారం తాజా మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫికర్ అలీ కలిసి ఎన్నికల ప్రచారంలో పూర్తిగా తన సహాయ సహకారాలు అందించాలని కోరారు. మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

యాకుత్‌పురా: యాకుత్‌పురా నియోజకవర్గంలో మజ్లిస్ అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మేరాజ్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

జియాగూడ: జియాగూడలోని సమర్థ నారాయణ ఆశ్రమంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా జరిగింది. శనివారం శ్రీవాసుదేవానంద భారతిస్వామివారి సంకల్పంతో 1116 మంది భక్తులతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం వరకు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థానం జగద్గురువులు అభినవ్ ఒద్దండ విద్యాశంకర భారతీస్వామి, వాసుదేవానంద భారతీస్వామీలు హాజరయ్యారు. శ్రీ సమర్థ కామధేను గోశాల పీఠాధిపతి ప్రభుదత్త మహారాజ్ మాట్లాడారు. గో సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చివరగా మహా అన్నదానం చేశారు.

రాజాసింగ్‌కు సన్మానం



రాజాసింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోషామహల్ సిట్టింగ్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ మరోసారి విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ నాయకులు దేవర వంశీ అన్నారు. శనివారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి రాజాసింగ్‌ను కలిశారు. ఆయనకు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. అశ్విన్‌మోదీ తదితరులున్నారు.

యువ రచయిత్రుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న మామిడి హరికృష్ణ

సుల్తాన్‌బజార్: సాహిత్య రంగానికి మరొక తరాన్ని అందించాలనే సంకల్పంతో మొదటిసారిగా తెలంగాణ సారస్వత పరిషత్ యువ రచయితల సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో యువ రచయిత్రుల సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ సాహిత్యంలోని పలువురు రచయితల రచనలు, యువ రచయితలకు పరిషత్ ప్రేరణ కలిగించిందన్నారు. కవిత్వం, కథ ఎలా రాయాలనే అంశంపై మెర్సీ మార్గరేట్, పెద్దింటి అశోక్‌కుమార్ రెండు విడతలుగా స్ఫూర్తి కలిగించేలా ప్రసంగించారు. డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపాన్యాసం చేస్తూ.. రచయిత్రుల్లో రచన పరిణతి పెంపొందించడానికి మున్ముందు మరిన్ని అధ్యాయ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, 170 మంది యువ రచయిత్రులు, కవయిత్రిలు సమ్మేళనంలో పాల్గొన్నారన్నారు. ప్రముఖ రచయితలు ముదిగంటి సుజాతరెడ్డి, వసుంధరరెడ్డి, ఉమాదేవి, శ్యామల, నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, డాక్టర్ యాకూబ్, కోటేశ్వర రావు, నరేష్‌రావు తదితరులున్నారు.

మైనార్టీలు మావెంటే !



షబానా మోమిన్‌తో మీర్ ఫిరాసత్ అలీ

చార్మినార్: రాష్ట్రంలోని మైనార్టీ ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని, ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు తమ విలువైన ఓట్లువేసి భారీ మెజార్టీతో గెలిపించనున్నారని బీజేపీ తెలంగాణ మైనార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి షబానా మోమిన్ అన్నారు. శనివారం పాతబస్తీ దారుషిఫాలోని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ కార్యాలయానికి చేరుకుని చార్మినార్‌లో ఎన్నికల ప్రచారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో తమ పార్టీకి మైనార్టీ ప్రజలు బ్రహ్మరథం పట్టనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. చార్మినార్ బీజేపీ అభ్యర్థి మొఘారాణి, అనిల్‌బజాజ్, మీర్ హదీ అలీ తదితరులున్నారు.

'రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



గోల్కొండ: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఘోర పరాభవం తప్పదని కాంగ్రెస్ నాంపల్లి నియోజకవర్గం అభ్యర్థి ఫెరోజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాంపల్లిలో తన విజయం ఖాయమని, భారీ మెజార్టీతో రాష్ట్రంలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీకి అభ్యర్థులే దొరకడం లేదని ఆయన ఎద్దేవ చేశారు. మరోవైపు మజ్లిస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలకు గులాములుగా మారి తమ పనులు చేయించుకునే పార్టీ అని ఆయన విమర్శించారు. నాంపల్లి నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని గత పదేళ్లల్లో నాంపల్లిలో ఏమాత్రం మార్పు రాలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, చంటిబాబు, పరామానందం, అమిత్‌ఖాన్, ఎం.ఆర్.రెడ్డి తదితరులున్నారు.

బీజేపీకి ఆశించిన ఫలితాలు



సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

చార్మినార్: ఈసారి బీజేపీ అభ్యర్థులు ఆశించిన ఫలితాలు సాధిస్తారని సీనియర్ బీజేపీ నాయకులు గాదేపాగ బాలక్రిష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. మలక్‌పేట్ బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన సంరెడ్డి సురేందర్‌రెడ్డిని ఆయన కలిసి అభినందనలు తెలిపారు. బీజేపీ నాయకులు జగ్జీవన్‌రాం, మన్మోహన్ చౌదరి తదితరులున్నారు.

'బీఆర్ఎస్ అభ్యర్థిని మార్చండి'

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా రెండోసారి కూడా మహ్మద్ సలావుద్దీన్‌లోధీని ప్రకటించడం సరికాదని నియోజక వర్గానికి చెందిన సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. ఆయనకు కాకుండా నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులలో ఒకరికి టిక్కెట్ కేటాయించాలని మొగల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల రాధాకృష్ణ, ఇలియాస్ ఖురేషి, గోపియాదవ్, పెండ్యాల లక్ష్మణ్‌రావు, గోపీగౌడ్, మణికొండ విజయ్‌కుమార్, గడ్డం సత్యనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కార్వాన్‌లో కమలం, మజ్లిస్ ఫైట్ !

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఈసారి ఇద్దరు ప్రధాన ప్రత్యర్థుల మధ్య రసవత్తర పోటీకి రంగం సిద్ధమైంది. మజ్లిస్ పార్టీ నుంచి గత రెండు సార్లు వరుసగా గెలుస్తూ.. వస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ను మజ్లిస్ ఈసారి కూడా బరిలోకి దింపింది. మరోవైపు ఆ పార్టీని ఢీ కొట్టగలిగే సమర్థుడైన అమర్‌సింగ్‌ను బీజేపీ తిరిగి పోటీలోకి నిలిపింది. చిరకాల ప్రత్యర్థులైన ఇద్దరు ప్రత్యర్థులు అప్పుడే ప్రచార రంగంలో పోటాపోటీగా ముందుకు దూసుకుపోతున్నారు.

మజ్లిస్ బలం..

కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్‌కు గట్టి పునాదులు ఉన్నాయి. నియోజకవర్గంలోని కార్వాన్, లంగర్‌హౌజ్, నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకీ, డివిజన్‌లకు మజ్లిస్ అభ్యర్థులే కార్పొరేటర్లుగా ఉన్నారు. ఏరియా కమిటీ వారే స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. మరోవైపు మజ్లిస్ ప్రాతినిధ్యం వహించే నానల్‌నగర్, గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో ముస్లిం, మైనార్టీలు ఎక్కువగా ఉంటున్నారు. మిగతా డివిజన్‌లలో కూడా ముస్లిమేతరులు మజ్లిస్‌కు అండగా ఉంటున్నారు. దళితబస్తీల అభివృద్ధి మజ్లిస్ ప్రచారంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. కాగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎమ్మెల్యే కౌసర్‌కు కార్వాన్ నియోజకవర్గంపై మంచి పట్టు ఉంది.

పుంజుకున్న బీజేపీ..

కార్వాన్ నియోజకవర్గంలో పూర్వ వైభవాన్ని పొందేందుకు ఈసారి బీజేపీ ఎన్నికలకు రెండేళ్ల ముందుకంటే పని చేయడం ప్రారంభించింది. బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో బీజేపీలోని అన్ని వర్గాల వారిని ఒకేతాటిపైకి తీసుకొచ్చారు. మరోవైపు యువమోర్చా, మహిళా మోర్చాలను పటిష్టపరిచారు. మరోవైపు పాలక బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న ప్రజల వ్యతిరేక ఓట్లు తమకే వస్తాయని బీజేపీ ధీమాగా ఉంది. మజ్లిస్‌కు మద్దతు పలుకుతున్న దళితులు, బీసీలను తమవైపు తిప్పుకునేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో బీజేపీ చాలా వరకు సఫలమవుతున్నారు. ఈసారి కార్వాన్‌లో కాషాయ జెండా ఎగరవేయడానికి ఆ పార్టీ శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తోంది.

'అభివృద్ధిపై పాలకులకు శ్రద్ధ లేదు'



మాట్లాడుతున్న ఎన్.వీరేందర్‌బాబు

గౌలిపురా: దశాబ్దాలుగా పాతబస్తీలో మజ్లిస్ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ.. పాతబస్తీ వెనుకబడిన ప్రాంతంగా ఉంటుందని బీజేపీ యాకుత్‌పురా నియోజకవర్గం అభ్యర్థి ఎన్.వీరేందర్‌బాబుయాదవ్ అన్నారు. గౌలిపురా డివిజన్ బీజేపీ అధ్యక్షులు రఘుకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గౌలిపురా డివిజన్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు తలమానికమైన పాతబస్తీ అభివృద్ధి పట్ల పాలకులకు ఏమాత్రం శ్రద్ధ లేదని విమర్శించారు. ప్రత్యేకంగా హిందువులు నివసించే ప్రాంతాల పట్ల వివక్ష చూపిస్తున్నారని, మా పోటీ మజ్లిస్‌తోనే ఉంటుందన్నారు. పాతబస్తీలో మెట్రోరైలు నిర్మాణానికి ఎంఐఎం పార్టీ, బీఆర్ఎస్ పార్టీ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, గౌలిపురా డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, గౌలీకర్ ధీరజ్‌లాల్, సిహెచ్.రూప్‌రాజ్, మహేశ్, వెంకటేష్, సుమన్ కుమార్ ముదిరాజ్, రాజేశ్వర్, శివచంద్రగిరి, కొడి సురేందర్, యాదగిరి, భానుప్రకాశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎటు చూసినా అక్రమ పార్కింగులే !



షేక్‌పేట్ జాతీయ రహదారిపై పార్కింగ్ ఇలా..

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మెహిదీపట్నం చౌరస్తా, రేతిబౌలి చౌరస్తాతో పాటు టోలిచౌకీ పరిసర ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌లు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. పాత ముంబాయ్ జాతీయరహదారి, సెవన్ తూమ్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌లు దర్శనమిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్ల వద్ద పరిస్థితి అధ్వానంగా తయారైందని మండిపడుతున్నారు. టోలిచౌకీ ఆర్టీఓ కార్యాలయంలో దానికి ఆనుకొని ఉన్న షాగౌస్ రెస్టారెంట్‌ల ముందు లెక్కకు మించి కార్లు రోడ్ల పైనే నిలిచి ఉంటున్నాయి. అక్రమ పార్కింగ్‌ను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.